క్లుప్తంగా

రేపు భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం

దుండిగల్‌: దుండిగల్‌ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్‌ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఈ నెల 30న (సోమవారం) స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 4 గంటలకు భ్రమరాంబ మల్లికార్జున స్వామిని గంగకు తీసుకువెళ్లుట, మధ్యాహ్నం 3 గంటలకు భ్రమరాంబ మల్లికార్జున వార్ల కల్యాణం, సాయంత్రం 4 గంటలకు బోనాలు, గొలుసులు తెంపుట, అగ్ని గుండం దాటుట, రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఒగ్గు కథ, 31న శుద్ధ ఏకాదశి రోజు నాగవెల్లి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ పేర్కొంది.

లోన్స్‌ టార్గెట్‌ పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్‌ సత్యనారాయణ

దుండిగల్‌: దుండిగల్‌ మున్సిపల్‌ కార్యాలయంలో శనివారం కమిషనర్‌ సత్యనారాయణ అధ్యక్షతన మెప్మా, పొదుపు సంఘాల ఎస్‌ఎల్‌ఎఫ్‌, టీఎల్‌ఎఫ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రీట్‌ వెండర్స్‌ లోన్స్‌, సెర్ప్‌ లోన్స్‌, ఎస్‌హెచ్‌జీ లోన్స్‌ టార్గెట్‌ పూర్తి చేయాలని సూచించారు.

మర్యాదపూర్వక కలయిక



కుత్బుల్లాపూర్‌: బాలానగర్‌ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రావు శనివారం సైబరాబాద్‌ సీపీ స్టీఫెన్‌ రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలమొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీనివాస్‌రావు గతంలో సైబరాబాద్‌ ట్రాఫిక్‌ డీసీపీగా, గర్నవర్‌కు ఏడీసీగా, ఖమ్మం ఓఎస్‌డీ, జనగామ, పాలేరుల ఎస్‌డీపీఓగా పని చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. సీపీ స్టీఫెన్‌ రవీంద్ర ఆదేశాల మేరకు లా అండ్‌ ఆర్డర్‌ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకుంటానన్నారు.

నాసిరకంగా డ్రైనేజీ నిర్మాణ పనులు




నాసిరకంగా చేపడుతున్న మ్యాన్‌హోల్‌ నిర్మాణం

కుత్బుల్లాపూర్‌: అధికారుల బాధ్యతా రాహిత్యం, కాంట్రాక్టర్‌ ఇష్టారాజ్యంతో డ్రైనేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా మారాయి. సుభాష్‌నగర్‌ ప్రభుత్వ పాఠశాల నుంచి రూ.6 లక్షల ఖర్చుతో వేస్తున్న డ్రైనేజీ లైన్‌ వారం రోజులు కాకముందే పెచ్చులు ఊడుతోంది. దీంతో స్థానికులు నాణ్యత విషయంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాల, మరోవైపు ప్రధాన రోడ్డు కావడంతో ఈ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఆటలు ఆడుకుంటూ డ్రైనేజీ గోతుల్లో పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇంజినీర్‌ సురేందర్‌ నాయక్‌ను 'సాక్షి' వివరణ కోరగా కాంట్రాక్టర్‌తో వెంటనే పనులు పూర్తిచేసే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

వినూత్న తరహాలో టీ స్టాల్‌

జగద్గిరిగుట్ట: సరికొత్త ఆలోచనలతో వ్యాపారస్తులు ముందుకు వెళ్తున్నారు. దుండిగల్‌ ఔటర్‌ రింగ్‌ రోడ్డు సమీపంలోని నర్సాపూర్‌ రాష్ట్ర రహదారి పక్కనే ఏర్పాటు చేసిన ఓ టీ స్టాల్‌ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పాత డ్రమ్ములకు మెరుగు దిద్ది వాటిని కూర్చునేందుకు వీలుగా మలిచారు. టేబుల్‌ను సైతం డ్రమ్మును ఉపయోగించి తయారు చేయడం గమనార్హం. అటుగా వెళ్లే వాహనదారులు ఒక్కసారి ఈ స్టాల్‌లో ఆగి వేడి వేడి చాయ్‌ను ఆస్వాదిస్తున్నారు.



డ్రమ్ములతో వినూత్న తరహాలో ఏర్పాటు చేసిన టీ స్టాల్‌

అంత చెల్లించలేం



బాచుపల్లిలో ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలు



ఓ మహిళకు రూ.19.53 లక్షలు చెల్లించాలని వచ్చిన నోటీస్‌



ఓ వ్యక్తికి రూ.20,47,500 చెల్లించాలని వచ్చిన నోటీసు

- అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ లబ్ధిదారులకు నోటీసులు
- పెద్ద మొత్తంలో నగదు చెల్లించాలని ఆదేశాలు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు
- నోటీసులపై స్పష్టత ఇవ్వని అధికారులు

నిజాంపేట్‌: ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించుకున్న నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 59 గందరగోళంగా మారింది. దీంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. 2014లో ప్రభుత్వం క్రమబద్ధీకరణ కోసం జీవో 58, 59లను తీసుకొచ్చింది. ఈ జీవోలకు కొనసాగింపుగా గత సంవత్సరం ఫిబ్రవరిలో గతంలో ఈ అవకాశాన్ని ఉపయోగించుకోని వారి కోసం మరోసారి అవకాశం కల్పించింది. దీంతో ప్రజలు ఫిబ్రవరి 21 నుంచి మార్చి 31 వరకు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గంలోని బాచుపల్లి మండలంలో 1,412 మంది, దుండిగల్‌ మండలంలో 1,656 మంది, కుత్బుల్లాపూర్‌ మండలంలో 14,518 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులపై అధికారులు క్షేత్ర స్థాయిలో విచారించి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపరిచారు. 59 జీవో లబ్ధిదారులకు గత నెల రోజుల నుంచి డిమాండ్‌ నోటీసులు ఎస్‌ఎంఎస్‌ల రూపంలో అందుతున్నాయి.

డిమాండ్‌ నోటీసులతో బెంబేలు..

జీవో 59 లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందుతున్న డిమాండ్‌ నోటీసులను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. 100 గజాలకు సైతం లక్షల్లో చెల్లించాలని నోటీసుల రావడంతో అవాక్కవుతున్నారు. నామమాత్రపు రుసుంతో ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తుందనుకుంటే తమను దోపిడీ చేస్తుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. నిజాంపేట్‌లోని శృతి విద్య అనే మహిళకు సర్వే నెంబర్‌ 334లో 120 గజాల స్థలంలో రేకుల షెడ్‌ ఉంది. దీనికి ఏకంగా రూ.19.53 లక్షలు మూడు విడతలుగా చెల్లించాలని నోటీసు ఇచ్చారు. అదే విధంగా నిజాంపేట్‌ సర్వే నెంబరు 191లో 120 గజాల్లో రేకుల గదులు ఉన్న సిందూరికి రూ.15.75 లక్షలు, 120 గజాల్లో గది ఉన్న దేవేంద్రకు రూ.20,47,500, బాచుపల్లి సాయినగర్‌లోని సర్వే నెంబరు 186లోని 124 గజాల రేకుల ఇంటికి రూ.15,62,400 చెల్లించాలని డిమాండ్‌ నోటీసులు అందాయి. 120 గజాల స్థలంలోని నిర్మాణాలకు కొన్నింటికి కేవలం రూ.1,50,000 నుంచి 2 లక్షల వరకు వచ్చిన నోటీసులు సైతం ఉన్నాయి.

డబ్బులు చెల్లించిన తర్వాత ఏం చేయాలి..

నోటీసులో తక్కువ వచ్చిన వారు మీ సేవా కేంద్రాల్లో చలాన్‌ తీసుకుని ఎస్‌బీఐలో డబ్బులు చెల్లించిన తర్వాత ఏం చేయాలని అడిగితే అధికారుల వద్ద సమాధానం లేదు. డబ్బులు చెల్లించకపోతే ఆన్‌లైన్‌ దరఖాస్తున్న తిరస్కరిస్తారు. లక్షల్లో చెల్లించాలని నోటీసులు వచ్చిన వారు తమ గోడు ఎవరికి చెప్పాలో తెలియడం లేదు. జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో డబ్బులు చెల్లించిన రసీదు ఇవ్వాలా లేక తహసీల్దార్‌ కార్యాలయంలో అందించాలా అనేదానిపై స్పష్టత లేదు.

చేతులెత్తేసిన అధికారులు..

డిమాండ్‌ నోటీసుల్లో లక్షలాది రూపాయలు చెల్లించాలని వచ్చిన లబ్ధిదారులు ఎవరికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వందలాది మంది ఫిర్యాదు చేసి చెల్లించాల్సిన డబ్బులను సవరించాలని కోరినా అధికారులు మాత్రం తమ చేతుల్లో ఏమీ లేదని, అవి కంప్యూటర్‌లో జనరేట్‌ అయిన నోటీసులు అని అంటున్నారు. అనేక మంది ఎమ్మెల్యే వివేకానందకు సైతం తమ గోడు వినిపించారు. 2014 జీవో ప్రకారం నాటి బేసిక్‌ వాల్యూలో 25 శాతం రుసుం చెల్లించాలని గతంలో పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఇప్పటి మార్కెట్‌ విలువ ప్రకారం నగదు చెల్లించాలని చెబుతున్నారని లబ్ధిదారులు ప్రభుత్వ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులపై స్పష్టత ఇవ్వాలి



పేదల స్థలాలకు లక్షల రూపాయలు చెల్లించాలని నోటీసులు వస్తున్నాయి. దీంతో అంత మొత్తం చెల్లించలేమని వారు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి 2014 భూ విలువ ప్రకారం రుసుం నిర్ధారిస్తూ వెంటనే జీవో విడుదల చేయాలి.

– శ్రీనివాస్‌, సీపీఐ నాయకుడు

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే చేయూత



అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే వివేకానంద్‌ చేయూతనందించారు. కుత్బుల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని పద్మానగర్‌ ఫేజ్‌–1లో ఇటీవల విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో శనివారం ఆ ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వివేకానంద్‌ బాధితులను పరామర్శించారు. మెన్స్‌ సెలూన్‌ దుకాణ యజమాని ఆంజనేయులు, స్క్రాప్‌ దుకాణ యజమాని జంపయ్య, ఫాస్ట్‌ఫుడ్‌ సెంటర్‌ నిర్వాహకుడు కృష్ణకుమార్‌లకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందిస్తామని ఎమ్మెల్యే బాధితులకు హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్‌, జనరల్‌ సెక్రటరీ సత్తిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరణ..

కుత్బుల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గణేష్‌నగర్‌లో ఈ నెల 30 నుంచి 1 వరకు నిర్వహించనున్న అమృతాలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాల వాల్‌ పోస్టర్‌ను మాజీ కార్పొరేటర్‌ బొడ్డు వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రాల అందజేత..

కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. కొంతమంది శుభకార్యాలకు రావాలని కోరుతూ ఆహ్వానపత్రికలు అందజేశారు.

మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సపై వర్క్‌షాప్‌

నిజాంపేట్‌: బాచుపల్లిలోని మమత అకాడమీ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌ (ఎంఏఎంఎస్‌)లో మోకాలి మార్పిడిపై శనివారం ప్రత్యక్ష శస్త్ర చికిత్స వర్క్‌షాప్‌ నిర్వహించారు. నిపుణుల ప్రసంగం ద్వారా మోకాలి రిప్లేస్‌మెంట్‌ (టీకేఆర్‌) ప్రక్రియలను ప్రముఖ సర్జన్లు ప్రత్యక్షంగా శస్త్ర చికిత్స చేయించి చూపించారు. ఈ వర్క్‌షాప్‌లో అపోలో హాస్పిటల్స్‌, కిమ్స్‌, మెడికోవర్‌ హాస్పిటల్స్‌కు చెందిన సర్జన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఏఎంఎస్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పువ్వాడ నయన్‌రాజ్‌ మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో మోకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందేందుకు సరైన చలనశీలతను పునరుద్ధరించడానికి మోకాలి మార్పిడి చికిత్సకు ఎంతో ముఖ్యమైనదిగా మారిందన్నారు. ఎంఏఎంఎస్‌ ఆర్థోపెడిక్‌ ఎడ్యుకేషన్‌, తెలంగాణ ఆర్థోపెడిక్‌ సర్జన్స్‌ అసోసియేషన్‌ (టీఓఎస్‌ఏ,) ట్విన్‌ సిటీస్‌ ఆర్థోపెడిక్‌ సొసైటీ(టీఎస్‌ఓఎస్‌), ఆర్థోపెడిక్‌ అసోసియేషన్‌–సౌత్‌ ఇండియన్‌ స్టేట్స్‌ (ఓఏఎస్‌ఐఎస్‌) సమన్వయంతో ఈ వర్క్‌షాప్‌ నిర్వహించారు. గౌరవ అతిథులుగా టీఓఎస్‌ఏ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ జీవీఎస్‌ మూర్తి, టీసీఓఎస్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ అల్వాల్‌ రెడ్డి, ఓఏఎస్‌ఐఎస్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ ఎస్‌.ఎస్‌.రెడ్డి, ఎంఏఎంఎస్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పువ్వాడ అపర్ణరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖ వైద్యులతో ఎంఏఎంఎస్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నయన్‌రాజ్‌

భార్యను వేధించిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష

కుత్బుల్లాపూర్‌: భార్యను వేధించడంతో పాటు ఆమెపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి శనివారం రెండు సంవత్సరాల శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ కృష్ణమూర్తిగౌడ్‌ తెలిపిన వివరాల మేరకు.. శామీర్‌పేట్‌ మండలం దేవరయాంజాల్‌కు చెందిన ప్రైవేట్‌ ఉద్యోగి సయ్యద్‌ సలీమ్‌ పాషా(48), జరీనా బేగం భార్యాభర్తలు. భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు హత్య చేసేందుకు యత్నించడంతో బాధితురాలు పేట్‌బషీరాబాద్‌ పోలీసులను ఆశ్రయించింది. అప్పట్లో నిందితుడిపై పోలీసులు 324, 325 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శనివారం నిందితుడిని మేడ్చల్‌ కోర్టులో హాజరు పరచగా అతనిపై నేరారోపణ రుజువు కావడంతో రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. ఈ కేసులో ఆధారాలను సేకరించడంలో కీలకంగా వ్యవహరించిన పేట్‌బషీరాబాద్‌ సీఐ ప్రశాంత్‌, ఎస్‌ఐపీ రామకృష్ణ, సీడీఓ శ్రీనివాస్‌లను కోర్టు అభినందించింది.

కోవిడ్‌ కేసులు నిల్‌

కుత్బుల్లాపూర్‌: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్‌–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి.. శనివారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 19 మందికి పరీక్షలు చేయగా అందరికీ నెగిటివ్‌ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి, దగ్గు లక్షణాలతో బాధపడుతున్న వారు వెంటనే కోవిడ్‌ పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలని అధికారులు సూచించారు.

ఖేలో ఇండియా పోటీలకు బాక్సర్‌ వర్షిత

కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ ప్రభుత్వ సోషల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్సియల్‌ ఉమెన్స్‌ డిగ్రీ కళాశాలలో బీకామ్‌ ఫస్ట్‌ ఇయర్‌ విద్యార్థిని సిల్వరి వర్షిత ఖేలో ఇండియాకు బాక్సర్‌గా ఎంపికైంది. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు మధ్యప్రదేశ్‌ రాజధాని భూపాల్‌లో జరిగే ఖేలో ఇండియా యూత్‌ గేమ్స్‌లో అండర్‌–19 విభాగంలో 54, 47 కేటగిరీల్లో వర్షిత పాల్గొననుంది. ఈ సందర్భంగా కోచ్‌ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ బాక్సింగ్‌ పోటీలకు ఎంపికైన వర్షిత ఇప్పటికే జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించిందన్నారు. తెలంగాణ సోషల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ ఓఎస్‌డీ డాక్టర్‌ భానుప్రసాద్‌, స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రామ్‌లక్ష్మణ్‌ వర్షితను ప్రోత్సహించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. డిగ్రీ కాలేజ్‌ స్పోర్ట్స్‌ ఇన్‌చార్జ్‌ శేషుకుమారి, ప్రిన్సిపాల్‌ ఇస్రాతే వర్షితను అభినందించారు.

క్రైం కార్నర్‌

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

దుండిగల్‌: కుటుంబ కలహాలతో భార్య వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సూరారం కాలనీ సిద్ధార్థ నగర్‌కు చెందిన అనిల్‌(32), జీవిక భార్యాభర్తలు. 4 నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలతో జీవిక భర్త నుంచి వేరుగా ఉంటోంది. ఈ క్రమంలో పలుమార్లు భార్యను ఇంటికి రావాల్సిందిగా అనిల్‌ కోరగా ఆమె తిరస్కరించింది. దీంతో మనస్తాపానికి గురైన అనిల్‌ శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు ఆకాష్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన పాలన అందించేందుకు కృషి



సెప్టిక్‌ ట్యాంక్‌ పనులను పరిశీలిస్తున్న చైర్మన్‌ శ్రీశైలంయాదవ్‌

కుత్బుల్లాపూర్‌: ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని కొంపల్లి మున్సిపల్‌ చైర్మన్‌ సన్న శ్రీశైలంయాదవ్‌ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపల్‌ కార్యాలయంలో ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్‌–2023లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీశైలంయాదవ్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పొడి, తడి చెత్తను వేరు చేయడం, హానికరమైన చెత్తను ఏ విధంగా డంప్‌ చేయాలన్న విషయాలపై పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ గంగయ్యనాయక్‌, కమిషనర్‌ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, కౌన్సిలర్‌ సన్న రవియాదవ్‌, ఎన్విరానిమెంట్‌, శానిటరీ అధికారులు, మెప్మా, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

పనుల పరిశీలన..

కొంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డులోని వీకర్‌ సెక్షన్‌ కాలనీలో రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన సెప్టిక్‌ ట్యాంక్‌ పనులను చైర్మన్‌ శ్రీశైలంయాదవ్‌ అధికారులతో కలిసి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

బ్లూ క్రాస్‌తో ఒప్పందం..

వీధి కుక్కల బెడద తగ్గించేందుకు శనివారం బ్లూక్రాస్‌ సంస్థతో కొంపల్లి మున్సిపాలిటీ ఒప్పందం కుదుర్చుకుంది. చైర్మన్‌ శ్రీశైలంయాదవ్‌ అధ్యక్షతన జరిగిన ఈ ఒప్పందంలో భాగంగా వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు నిర్వహించి వాటి సంతతి పెరగకుండా చర్యలు తీసుకోనున్నారు. బ్లూ క్రాస్‌ సంస్థ ప్రతినిధి కుమారి, మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఆర్‌ఐటీలో ముగిసిన హ్యాకథాన్‌



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, చైర్మన్‌ లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్‌: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్‌ఐటీ) కళాశాలలో 2కె23 ఇన్వెన్షన్‌ పేరిట 36 గంటల పాటు జరిగిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌ శనివారం ముగిసింది. ఈ హ్యాకథాన్‌లో దేశ వ్యాప్తంగా 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయి హ్యాకథాన్‌ విజయవంతం కావడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి హ్యాకథాన్‌లు మరిన్ని నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఐటీ రంగం అభివృద్ధికి సీఎం కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌ కృషి చేస్తూ లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఇన్వెన్షన్‌ 2కె23 విజయవంతం కావడంలో అధ్యాపకులు, విద్యార్థుల కృషి ఎంతో ఉందని, తమ విద్యార్థులను గ్లోబల్‌ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు ప్రయతిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్‌ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్‌ మర్రి అనుశ్రేయ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం



సూర్య నమస్కారాలు చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్‌: ఆరోగ్యానికి అధిపతి అయిన సూర్య భగవానుడికి నిత్యం సూర్య నమస్కారాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని యోగా గురువు కె.రవీందర్‌రాజు అన్నారు. ఆదివారం రథ సప్తమిని (సూర్య భగవాన్‌ జయంతిని) పురస్కరించుకొని జీడిమెట్ల విలేజ్‌లోని సరోజిని గార్డెన్‌లో శివ హోమ్‌ యోగా రీసెర్చ్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో 108 సూర్య నమస్కారాలు చేయించారు. అనంతరం సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు చేసి ఆయన ప్రాముఖ్యతను తెలియజేశారు.

విచ్చలవిడిగా వ్యర్థాల డంపింగ్‌



సొసైటీలోని స్యూటిక్‌ పరిశ్రమ ఎదురు డంప్‌ చేసిన వ్యర్థాలు

జీడిమెట్ల: జీడిమెట్లలోని ఏస్వీ కో ఆపరేటివ్‌ సొసైటీలో రసాయన వ్యర్థాలను విచ్చలవిడిగా డంప్‌ చేస్తున్నారు. సొసైటీకి ఆనుకుని ఎక్కువగా రీసైక్లింగ్‌, రసాయన గోదాంలు ఉండడంతో వ్యర్థాల డంపింగ్‌ ఎక్కువగా ఈ ప్రాంతంలోనే జరుగుతోంది. జీడిమెట్లతో పాటు బాలానగర్‌, గడ్డపోతారం, బొంతపల్లి పారిశ్రామికవాడలో ఉన్న పరిశ్రమల వ్యర్థాలను జీడిమెట్లలో డంప్‌ చేస్తున్నారు. ఇక్కడ వ్యర్థాల డంపింగ్‌కు పాల్పడే వారిని గుర్తించేందుకు సీసీ కెమరాలు సైతం లేవు. దీంతో డంపింగ్‌ చేసేవారు నిర్మాణుష్యంగా ఉండే ఏస్వీ కో ఆపరేటివ్‌ సొసైటీని ఎంచుకుని విచ్చలవిడిగా డంప్‌ చేస్తున్నారు. ఈ విషయమై ఐలా, పీసీబీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలి..

గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలను డంప్‌ చేసేవారిని గుర్తించాలంటే సీసీ కెమరాలు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రీసైక్లింగ్‌ నిర్వహించే వ్యక్తులే వ్యర్థాలను డంప్‌ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బొంతపల్లి, బాలానగర్‌లోని పరిశ్రమల నుంచి ప్లాస్టిక్‌ కవర్లు, డ్రమ్ములను రీసైక్లింగ్‌ పరిశ్రమల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. అనంతరం వాటిని గంపలబస్తీలోని రీసైక్లింగ్‌ యూనిట్‌లకు తరలిస్తారు. అనంతరం వారికి పనికిరాని వాటిని ఈ విధంగా ఖాళీ ప్రదేశాల్లో డంప్‌ చేస్తుంటారని ప్రజలు చెబుతున్నారు. డంపింగ్‌ చేసిన ప్రాంతాల్లో ఉన్న బాటిళ్ల లేబుళ్లను గుర్తించి ఆయా పరిశ్రమలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.